క్లుప్తంగా

కొనసాగుతున్న పింఛన్ల పంపిణీ


లద్దగిరిలో వృద్ధురాలు ఎల్లమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ మద్దయ్య

కోడుమూరు: వైఎస్సార్ పెన్షన్ కానుక కొనసాగుతోంది. వలంటీర్లు సోమవారం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వేలిముద్రలు తీసుకుని, పెన్షన్ సొమ్మును అందజేశారు. వేలి ముద్రలు పడని వారికి ఫేష్ యాప్ ద్వారా పింఛన్ సొమ్మును అందజేశారు. మండలంలో 8,782 పింఛన్లుండగా సోమవారం సాయంత్రానికి 8,587 మంది (98 శాతం)కి పింఛన్ సొమ్ము అంజేసినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు.

– **గూడూరు రూరల్:** మండలపరిధిలో మూడో రోజు సోమవారం పింఛన్ల పంపిణీ కొనసాగింది. వలంటీర్లు, సచివాలయ ఉద్యో గులు పెంచన్‌దారుల ఇళ్లకువెళ్లి పింఛన్ సొమ్ము అందించారు. ఇప్పటి వరకు 90 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీఓ మాధవీలత తెలిపారు.

తప్పిన ప్రమాదం


ముళ్లపొదల్లోకి దూసుకెళ్లిన లారీ

పాణ్యం : మండల పరిధిలోని జాతీయ రహదారిపై నూలుమిల్లు వద్ద సోమవారం పెను ప్రమాదం తప్పింది. వెనుక నుంచి అతివేగంగా వచ్చిన ఓ వాహనం కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న లారీ ముందు అకస్మాత్తుగా ఎడమవైపుకు తిప్పడంతో నూలుమిల్లు గేటులోని ముళ్లపొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. విషయం తెలుసుకున్న హైవే అధికారులు ముళ్లపొదల్లో ఇరుక్కుపోయిన లారీని బయటకు తీశారు. లారీలో ఎలాంటి లోడు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం


కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం


అలంకరణలో శ్రీ వల్లి సుబ్రమణ్యేశ్వరస్వామి

పాణ్యం : మండల పరిధిలోని కొత్తూరు గ్రామంలో వెలసిన శ్రీ వల్లి సుబ్రమణ్యేశ్వరస్వామికి సోమవారం కర్నూలు నగరానికి చెందిన వంశీధర్, సుప్రియ దంపతులు 108 లీటర్ల ఆవుపాలతో అభిషేకం చేశారు. ఉత్సవ మూర్తులుకు ప్రధాన అర్చకులు నారాయణస్వామి ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణం జరిపించారు.

సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలు


రైతులకు సబ్సిడీ పశుగ్రాస విత్తనాలు పంపిణీ చేస్తున్న పశువైద్యుడు ప్రవీణ్‌కుమార్

సి.బెళగల్: మండల పాడి రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేస్తోందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని సి.బెళగల్ పీహెచ్‌సీ పశువైద్యుడు ప్రవీన్‌కుమార్ అన్నారు. సోమవారం ఆయన మండలంలోని క్రిష్ణదొడ్డి గ్రామంలో రైతులకు సబ్సిడీపై మంజూరైన పశుగ్రాస విత్తనాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మండలానికి మొక్కజొన్న రకం 250 కేజీలు, జొన్న రకం 250 కేజీలు చొప్పున ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు.

అక్రమ మద్యం బాటిళ్లు సీజ్

కర్నూలు (న్యూటౌన్): తెలంగాణ రాష్ట్రం నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి కర్నూలులో విక్రయిస్తుండగా మూడవ పట్టణ ఎస్‌ఐ చిరంజీవి, సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. కర్నూలు బుధవారపేటకు చెందిన సయ్యద్ షాహిద్ బాషా, ఆకులేటి సాగర్, సల్కాపురం రాజు, టీకూరు శేఖర్‌లను బుధవారపేటలోని హబీబ్ ముబారక్‌నగర్, హంద్రీ బ్రిడ్జి వద్ద అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి 24 డెక్కన్ బ్లూ విస్కీ బాటిళ్లను స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అర్జీలపై స్పందించండి

గూడూరు: స్పందనలో వచ్చే అర్జీలపై సిబ్బంది వెంటనే స్పందించాలని తహసీల్దార్ శివశంకర్ నాయక్ సూచించారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అధికారులు ప్రజలను ఊరికే కార్యాలయాల చుట్టూ తిప్పుకోవద్దని సూచించారు. ఎంపీడీఓ మాధవీలత, ఏపీఓ సూధకర్, ట్రాన్స్‌కో ఏఈ శ్రీనివాసనాయక్, తదితర అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు



కంబదహాల్‌లో సాయిబాబాను దర్శించుకుంటున్న ప్రజలు, పాణ్యంలోని నర్సరీ పుల్లయ్య ఆలయంలో శ్రీ గణపతి, దత్తత్రేయ సమేత షిరిడీ సాయిబాబా

కోడుమూరు రూరల్: గురుపౌర్ణమి పర్వదిన వేడుకలను సోమవారం మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. పట్టణంలోని కోటవీధి, ప్యాలకుర్తి, పులకుర్తి గ్రామాల్లో వెలసిన సాయిబాబా ఆలయాలకు ఉదయం నుంచే భక్తులు భారీ సంఖ్యలో చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయి భక్త బృందం సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. సాయంత్రం సాయిబాబా చిత్రపటాన్ని పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. కోటవీధిలో వెలసిన శ్రీసాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కంబదహాల్‌లో..

సి.బెళగల్: మండల పరిధిలోని కంబదహాల్ గ్రామంలో సోమవారం గ్రామస్తులు గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కాగడ హారతి, అభిషేకాలు తదితర పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు. సాయిబాబా చిత్ర పటాన్ని పల్లకీలో ఊరేగించారు. కార్యక్రమాలు మంగళవారం కూడా కొనసాగుతాయని గ్రామ పెద్దలు తెలిపారు.

భక్తులతో పోటెత్తిన సాయిబాబా ఆలయాలు

పాణ్యం: గురు పౌర్ణమి సందర్భంగా మండలంలో ని షిరిడీ సాయి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తుల తాకిడి పెరిగింది. మండల కేంద్రమైన పాణ్యంలోని హైవే వద్ద ఉన్న పుల్లయ్య నర్సరీలో వెలసిన శ్రీ షిరిడీ ఆలయంలో సాయిబాబా, గణపతి, దత్తత్రేయ స్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. తెల్లవారుజాము నుంచి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే రైల్వే గేటు వద్ద ఉన్న సాయిబాబా ఆలయంలో నిర్వాహకులు వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. భూపనపాడు గ్రామంలో వెలసిన సాయిబాబాగుడికిభక్తులు పోటెత్తారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్త తాకిడిని దృష్టిలో ఉంచుకొని నిర్వహకులు అన్నిరకాల సౌకర్యాలు ఏర్పాటు చేశారు.

కల్లూరు: మండలంలో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. సోమవారం కల్లూరు అర్బన్ పాత కల్లూరులో వెలసిన దత్త స్వరూపులు శ్రీ శ్రీ అవధూత రామిరెడ్డి తాత సేవ సంస్థాన్‌లో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తాతగారిని దర్శనం చేసుకున్నారు. ఉదయం మేలుకొలుపు, పంచామృత అభిషేకము, అర్చన, మహా హారతి విష్ణు సహస్రనామ పారాయణం కార్యక్రమాలు జరిగాయి. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు. పల్లకీ ఉత్సవం కల్లూరు వీధులలో భక్తుల నిరాజనాల మధ్య సాగింది. కార్యక్రమంలో సంస్థాన్ అధ్యక్షుడు దాసరి రామచంద్రరెడ్డి, కల్లూరు 33వ వార్డు కార్పొరేటర్ నరసింహులు, రంగప్ప, గంగాధరం, తారకేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గడివేముల: మండల కేంద్రంలోని సాధుమఠం పక్కనున్న సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు బాబా హారతినిచ్చారు. దుర్వేశి బాట వద్ద ఉన్న దేవాలయంతో పాటు చిందుకూరులోనూ వేడుకలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు.

గూడూరు: పట్టణంలో సోమవారం గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని సాయి బాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు నిర్వాహకులు అన్న దానం నిర్వహించారు.


కోడుమూరు కోటవీధిలో ప్రత్యేక అలంకరణలో శ్రీసాయిబాబా


శ్రీ శ్రీ అవధూత రామిరెడ్డి తాతను అలంకరించిన దృశ్యం

అప్పటికప్పుడే సమస్యల పరిష్కారం

- ఫైసా ఖర్చు లేకుండా ధ్రువీకరణ పత్రాల అందజేత
- జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్


బీ తాండ్రపాడులో లబ్ధిదారురాలికి కులధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కర్నూలు (న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం పైసా ఖర్చు లేకుండా, కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా అవసరాలు తీరుస్తున్న సువర్ణ పాలనను ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం కర్నూలు మండలం బీ తాండ్రపాడు, పంచలింగాల గ్రామాల్లో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరు కావడంతో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఇంటి వద్దకే వలంటీర్లు వచ్చి సమస్యలు తెలుసుకుంటున్నారన్నారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు వర్తింపజేస్తూ వారు కోరిన సర్టిఫికెట్లను అందజేస్తున్నారని చెప్పారు. దీంతో అన్ని వర్గాల ప్రజలు లబ్ధిపొందుతున్నారన్నారు. బీ తాండ్రపాడు గ్రామంలో 57, పంచలింగాల గ్రామంలో 52 కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్న కుమార్, సచివాలయ కన్వీనర్లు చిన్నలక్ష్మన్న, మోహన్‌బాబు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, మాజీ మండల ఉపాధ్యక్షులు వాసు, కర్నూలు రూరల్ తహసీల్దార్ శివరాముడు, ఎంపీడీఓ అజాంఖాన్, ఈఓఆర్‌డీ నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అమ్మఒడితో అక్షరాస్యత వృద్ధి

జగనన్న అమ్మఒడితో అక్షరాస్యత వృద్ధి చెందుతుందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. అక్షరాస్యతతో ప్రతి కుటుంబం ఆర్థికప్రగతి సాధిస్తుందని చెప్పారు. సోమవారం మధ్యాహ్నం కర్నూలు మండలం పంచలింగాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 'జగనన్న అమ్మ ఒడి' కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. తల్లిదండ్రులకు పిల్లల చదువు భారం కాకూడదనే ఉద్దేశంతోనే జగనన్న అమ్మ ఒడితో ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారని చెప్పారు. అమ్మ ఒడి సాయం పిల్లల విద్యావసరాలకు ఉపయోగ పడుతుందన్నారు. చంద్రబాబు హయాంలో ప్రభుత్వ పాఠశాలలను మూసేసి నీరుగార్చి ప్రైవేట్ పాఠశాలలను ప్రోత్సహించారని, జగనన్న పాలనలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులకు పోటీగా ఉన్నారన్నారు. కర్నూలు మండల పరిధిలోని 9,423 మంది విద్యార్థులకు గాను రూ.12,24,99,000 తల్లుల ఖాతాలో నగదు జమ అయ్యాయని చెప్పారు. కార్యక్రమంలో కర్నూలు ఎంపీపీ వెంకటేశ్వరమ్మ, జెడ్పీటీసీ ప్రసన్నకుమార్, తహసీల్దార్ శివరాముడు, ఎంఈఓ వినోద్‌కుమార్, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ మండల కన్వీనర్ హరినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పథకాలతో పేద కుటుంబాల్లో ఆనందం


మహిళకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్

కోడుమూరు రూరల్: సంక్షేమ పథకాలలో ప్రతి పేద కుటుంబం ఆనందంగా ఉందని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం కోటవీధి, పెద్ద బోయ వీధుల్లో పర్య టించారు. ఇంటింటికి వెళ్లి పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. నాలుగేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిని వివరించి సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలుపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయన్న, ఎంపీడీఓ చంద్రశేఖర్, స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు రాజశేఖర్‌రెడ్డి, లాయర్ ప్రభాకర్, షాకీర్‌బాషా, మధుమోహన్ రెడ్డి, బలరాం, మధు, అయ్యప్ప పాల్గొన్నారు.

- కోడుమూరులోని గ్రామ సచివాలయం–3 పరిధిలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. ఎమ్మెల్యే సుధాకర్ ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుంటారని, మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటరీలు పాల్గొనాలని కోరారు.

'స్పందన' సమస్యలను పరిష్కరించండి


ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

సి.బెళగల్: స్పందన కార్యక్రమంలో వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని తహసీల్దార్ శేషఫణి అధికారులకు సూచించారు. సోమవారం ఆయన తన కార్యాలయంలో ఎంపీడీఓ రాముడు, మండల అధికారులతో కలిసి స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రేషన్ కార్డులు, మురుగు కాలువలు, భూ సమస్యలపై వినతులు రాగా.. వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని బాధితులకు అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సందీప్, ఏఓ మల్లేష్ కుమార్, ఎంఈఓ జ్యోతి, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్, విద్యుత్ ఏఈలు గోసేనాయక్, సుమంత్, సుకుమార్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి, లైబ్రేరియన్ వెంకటరమణ ఉన్నారు. కాగా స్పందనకు గైర్హాజరైన అధికారులపై చర్యలకు ఆయా శాఖల జిల్లా అధికారులకు సిఫార్సు చేయనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

గూడూరు రూరల్: స్పందనకు ప్రజల నుంచి వచ్చే అర్జీలకు పరిష్కారం చూపాలని ఎంపీడీఓ మాధవీలత సూచించారు. కె.నాగలాపురంలోని సచివాలయాన్ని సోమవారం ఆమె తనిఖీ నిర్వహించారు. సచివాలయాల్లో ప్రతి రోజు స్పందన కార్యక్రమం ఉంటుందని, ఆయా గ్రామాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలు అందించవచ్చని చెప్పారు. స్పందన అర్జీలను పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కారం చూపునున్నట్లు చెప్పారు.

వలంటీర్ ఔదార్యం


బుగ్గన్నకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ హేమలత

ఓర్వకల్లు : మండలంలోని సోమయాజులపల్లె గ్రామానికి చెందిన మునిపాటి బుగ్గన్న అనే వృద్ధునికి ఆరోగ్యం సరిగాలేక పోవడంతో 20 రోజుల క్రితం శ్రీశైలం మండలం, సున్నిపెంటలో నివాసం ఉంటున్న తన కొడుకు మునిపాటి శేషాద్రి వద్దకు వెళ్లాడు. విషయం తెలుసుకున్న హేమలత అనే వలంటీర్ సోమవారం ఉదయం తన భర్తను వెంట పెట్టుకొని సున్నిపెంటకు బయలుదేరింది. అక్కడ బుగ్గన్న ఉన్న అడ్రస్‌ను పట్టుకొని ఇంటికి వెళ్లింది. వేలి ముద్రలు తీసుకొని ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2,750 లు పింఛన్ సొమ్మును అందజేసింది. దీంతో ఆ వృద్ధుడి కుటుంబ సభ్యులు హేమలతకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీఓ శివనాగప్రసాద్ సొంత ఖర్చులతో వెళ్లి పింఛన్ సొమ్మును అందజేసిన హేమలతకు అభినందనలు తెలిపారు.

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి


ధ్రువీకరణ పత్రం అందిస్తున్న తహసీల్దార్, కార్పొరేటర్

కల్లూరు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ టీవీ రమేష్ బాబు అన్నారు. సోమవారం కల్లూరు అర్బన్ 27వ వార్డు 66వ వార్డు సచివాలయం దగ్గర జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన 11 రకాల ధ్రువీకరణ సర్టిఫికెట్లులను ఉచితంగా అందిస్తుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ లక్ష్మికాంతరెడ్డి, సాయి, వార్డులోని నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

–19వ వార్డులోని 46వ వార్డు సచివాలయం పరిధిలోని నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి హాజరై లబ్ధిదారులకు కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గోపాల్‌రెడ్డి, శివరాం స్వామి, యూనిస్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు జగనన్న సురక్ష సదస్సులు

సి.బెళగల్: మండలంలోని కొత్తకోట, ఈర్లదిన్నె గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష సదస్సులను నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాముడు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో ప్రభుత్వ పథకాలకు అర్హులను గుర్తించడంతో పాటు అవసరమైన 11 రకాల ధ్రువ పత్రాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

కోడుమూరు రూరల్: మండలంలోని ఎర్రదొడ్డి, అనుగొండ గ్రామాల్లో నిర్వహించే జగనన్న సురక్ష సదస్సులకు, అనుగొండ హైస్కూల్‌లో జరిగే అమ్మ ఒడి కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ హాజరవుతారని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు.

పత్తిలో సంరక్షణ చర్యలు అవసరం


గొల్లలదొడ్డిలో రైతుకు పత్తిపంట సంరక్షణ పద్ధతులను తెలుపుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండల రైతులు పత్తి పంటలో సంరక్షణకు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్‌కుమార్ సూచించారు. సోమవారం ఆయన మండలంలోని గొల్లలదొడ్డి, బురాన్‌దొడ్డి గ్రామాలలో పర్యటించి రైతులు సాగు చేసుకుంటున్న పత్తి పంటలను పరిశీలించారు. పంటల బెట్టకు గురవుతుండటం, ఎర్ర తెగుళ్లను గమనించిన ఏఓ సంరక్షణ పద్ధతులను రైతులకు తెలియజేశారు. ప్రస్తుతం పంటలు ప్రాథమిక దశలో ఉన్నందున 19:19:19 లేదా, 13:0:45 ఎరువులను ఒక్క లీటరు నీటికి 5 గ్రాముల చొప్పున కలుపుకుని మొక్కలపై పిచికారీ చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా సూక్ష్మ పోషకాలైన మెగ్నీషియం, జింక్ వంటి ధాతువులను కూడా పిచికారీ చేసుకోవాలన్నారు.

నేడు ఓర్వకల్లు సీహెచ్‌సీ ప్రారంభం

ఓర్వకల్లు : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) భవనాన్ని మంగళవారం ప్రారంభించనున్నట్లు స్థానిక వైద్యాధికారి డాక్టర్ మంజుల సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. సుమారు రూ.4 కోట్లతో నిర్మించిన 30 పడకల ఆసుపత్రి భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

ప్రతి రైతులకు సాగు సాయం అందించాలి

కల్లూరు: తెలంగాణ ప్రభుత్వ తరహాలో ప్రతి రైతుకు ఎకరాకు రూ.10వేలు సాగుసాయం అందించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం, సీపీఐ నాయకులు శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. సోమవారం పెద్దటేకూరు, చిన్నటేకూరు గ్రామ సచివాలయాల పంచాయతీ కార్యదర్శులకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి పుల్లన్న, రామాంజనేయులు, సరేంద్రయాదవ్ పాల్గొన్నారు.

కంపచెట్ల మధ్య ట్రాన్స్‌ఫార్మర్


ముళ్ల పొదల మధ్య ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

పాణ్యం : మండల పరిధిలోని రసూల్లపేటలోని ఓహెచ్ఆర్ ట్యాంక్ సమీపంలో ఓ ట్రాన్స్‌ఫార్మర్ కంపచెట్ల మధ్యలో ఉంది. చుట్టూ విపరీతమైన పిచ్చిమొక్కలు, బురద ఉండడం, తీగలకు చెట్ల కొమ్మలు తగులుతుండడంతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్ష కాలం ప్రారంభమవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు.

రూ.2.20 కోట్ల పరిహారం మంజూరు

ఓర్వకల్లు: వైఎస్సార్ ఉచిత పంట బీమా పథకం కింద మండలానికి రూ.2.20 కోట్ల పరిహారం మంజూరైనట్లు మండల వ్యవసాయాధికారి సుధాకర్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. 2022 ఆర్థిక సంవత్సరంలో ఖరీఫ్ కింద పంటలు సాగు చేసి నష్టపోయిన రైతులను ఈ–క్రాప్ నమోదు ఆధారంగా ప్రభుత్వానికి నివేదికలు పంపడం జరిగిందన్నారు. మండలంలోని మొత్తం 19 రైతు భరోసా కేంద్రాల పరిధిలో వాతావరణం, దిగుబడుల ఆధారంగా నష్టపోయిన రైతులకు ప్రభుత్వం 'వైఎస్సార్ ఉచిత పంట బీమా' పథకాన్ని వర్తింపజేసిందన్నారు. అందులో భాగంగా ఉల్లి, వేరుశనగ, జొన్న పంటలు సాగు చేసిన రైతులకు పరిహారం సొమ్మును మంజూరు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం మండలంలో వాతావరణ ఆధారిత బీమా కింద 1,337 మంది రైతులు 2005 ఎకరాలలో సాగు చేసిన పంటలకు బీమా పరిహారం రూ.2,05,07,488 మంజూరయ్యిందన్నారు. దిగుబడి ఆధారిత బీమా కింద 106 మంది రైతుల 183.36 ఎకరాలల్లో పంటలకు రూ.15,87,691 విడుదలయ్యాయని చెప్పారు. పరిహారం మంజూరైన రైతుల జాబితాలను సామాజిక తనిఖీ నిమిత్తం ఆయా ఆర్‌బీకేలలో ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ

గూడూరు: గూడూరు మండల ఎంఈఓ–2 గా బి.నాగరాజు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎంఆర్సీ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించగా మండల యూటీఎఫ్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వర్షంతో పంటలకు జీవం

కోడుమూరు రూరల్: మండలంలో ఆదివారం రాత్రి 21.8 మి.మీ వర్షం కురవడంతో ఖరీఫ్ కింద సాగైన పంటలకు జీవం పోసినట్లైంది. 20 రోజుల క్రితం కురిసిన వర్షాలకు మండలంలో రైతులు పత్తి, కొర్ర, వేరుశనగ, కంది, పొద్దుతిరుగుడు పంటలను సాగు చేశారు. అప్పటి నుంచి వానల్లేక ఎండిపోతున్న పైర్లను చూసి దిగులు చెందుతున్న తరుణంలో ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో కాస్త కుదుట పడ్డారు.


శిథిలావస్థకు చేరుకున్న మరుగుదొడ్డి

బస్టాండ్‌లో 'మరుగు' కష్టాలు

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని ఆర్టీసీ ప్రయాణికులకు మరుగు కష్టాలు తప్పడంలేదు. పాణ్యంలోని పెద్ద బస్టాండ్‌ను రోడ్డు విస్తరణలో తొలగించారు. తర్వాత చిన్న పాటి బస్టాండ్‌ను నిర్మించి చేతులు దులుపుకున్నారు. అయితే ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ వెనుక చిన్న పాటి మరుగుడొడ్డిని నిర్మించారు. కానీ నీటి కనెక్షన్ ఇవ్వలేదు. దీంతో కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. చివరికు శిథిలావస్థకు చేరుకుంది. బస్సుల కోసం వేచి ఉండే మహిళలు, వృద్ధులు అత్యవసరమైతే మరుగుదొడ్లకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. అధికారులు చర్యలు తీసుకొని మరుగుదొడ్లు బాగు చేయాలని కోరుతున్నారు.

నేడు తాండ్రపాడు పరిధిలో విద్యుత్ కోత

కర్నూలు(రాజ్‌విహార్): టిడ్కో సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ పనులు జరుగుతున్న కారణంగా మంగళవారం బి.తాండ్రపాడు పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు రూరల్స్ డీఈఈ వై. సుబ్బన్న సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టిడ్కో ఇళ్ల కోసం ప్రభుత్వం కొత్తగా సబ్‌స్టేషన్ మంజూరు చేసింది. 33 కేవీ విద్యుత్ లైను లాగేందుకు అధికారులు పనులు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు బి. తాండ్రపాడుతో పాటు ప్రజా నగర్, కాదంబరి టౌన్‌షిప్, టిడ్కో చుట్టు పక్కల కరెంటు ఉండదని పేర్కొన్నారు.